సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

'పట్టు' దొరకలేదు..!

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ప్రధాన పంటగా వేరుశనగను సాగు చేస్తుంటారు. ప్రతి ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలు చేతికందకుండా పోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా రైతులు మల్బరీ పట్టుసాగుపై దృష్టి సారిస్తున్నారు. గతంలో మల్బరీ సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందేవి. వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రోత్సహకాలు తగ్గిపోవడంతో రైతులు ఈ పంటసాగుపై ఆసక్తిని తగ్గించుకుంటున్నారు.

◆ మల్బరీసాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

◆ గిట్టుబాటు లేక సాగుపై ఆసక్తి తగ్గించుకున్న రైతులు

ప్రజాశక్తి-గుడిబండ

గత ప్రభుత్వం మల్బరీ రైతుల కోసం పట్టు పురుగులను మేపుకోవడానికి వాటికి అవసరమయ్యే పరికరాలతో పాటు రైతులకు మల్బరీ షెడ్లు మంజూరు చేసేవారు. షెడ్లకు అవసరమైన డబ్బులను వివిధ దశల్లో బిల్లుల రూపంలో ఇచ్చేవారు. ఒక్కొక్క మల్బరీ మొక్క 2 రూపాయల ప్రకారం అందించేవారు. దీంతో రైతులు కూడా ఉత్సాహంతో మల్బరీ పంట సాగుపై ఆసక్తి చూపేవారు. గుడిబండ మండల వ్యాప్తంగా దాదాపు 1400 ఎకరాల్లో రైతులు మల్బరీ పంటను సాగు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం మల్బరీ రైతులకు రావాల్సిన రాయితీలను రద్దు చేసింది. రాయితీలు తగ్గిపోవడంతో మల్బరీ రైతులు దీనిని సాగును తగ్గించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ప్రభుత్వ సాయం లేక మరోవైపు పంటకు గిట్టుబాటు లేకపోవడంతో రైతులు దాని సాగుపై ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ఒక్కొక్క మల్బరీ మొక్క కొనాలంటే 5 రూపాయల వరకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వం ఒక్కొక్క మొక్కకు 2.25 పైసలు మాత్రమే రైతులకు చెల్లిస్తోంది. మల్బరీకి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో చాలామంది రైతులు మల్బరీ పంటను తొలగించేస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూ వస్తోంది.

ప్రభుత్వ ప్రోత్సాహకం కరువు

తమ కుటుంబం అంతా చాలాకాలంగా మల్బరీ పంటను నమ్ముకుని వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుత ప్రభుత్వం మల్బరీ సాగు ప్రోత్సాహకాలను దాదాపు రద్దు చేసింది. గతంలో బై వోల్టిన్ రకపు పట్టుగూళ్లకు కిలోకు అదనంగా 50 రూపాయలను రైతులకు ఇచ్చేవారు. ఇప్పుడు దానిని రద్దు చేశారు.

తిమ్మేగౌడ్.మల్బరీ రైతు హనుమంతనపల్లి..

స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలి

పట్టుగూళ్ల అమ్మకానికి సుదూర ప్రాంతమైన హిందూపురం, కర్ణాటక రాష్ట్రం షెడ్లగట్ట రామ్‌నగర్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లాలి. వాహనాలు, కూలీలు ఖర్చులు చాలా ఎక్కువగా వస్తున్నాయి. స్థానికంగానే ప్రభుత్వం పట్టుగుళ్ల మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఉపయోగంగా ఉంటుంది. గిట్టుబాటు ధర కల్పించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించాలి.

రంగారెడ్డి, మల్బరీ రైతు, కెన్.పల్లి.

రైతులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి

మల్బరీ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే వేరుశనగ పంట వల్ల తీవ్ర నష్టాలను చవిచూశాం. ఇలాంటి పరిస్థితుల్లో మల్బరీ పంట ద్వారా అయినా కొంత ఉపయోగం ఉంటుందని భావించాం. అయితే ప్రభుత్వ సాయం తగ్గిపోవడంతో పంట సాగు చేయడం మరింత భారం అవుతోంది.

కరిపుట్టప్ప, మల్బరీ రైతు, బసవనపల్లి.

కష్టం కార్మికులది.. సంపద కార్పొరేట్లకు..!

◆ అంబానీ, అదానీల సేవలో కేంద్ర ప్రభుత్వం

◆ రాయలసీమలో ఖనిజ సంపద ఆధార పరిశ్రమలు పెట్టాలి

◆ కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలే మార్గం

◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్మికుల కష్టాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. సిఐటియు రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించే సమావేశాలకు రాయలసీమ వ్యాప్తంగా ఉన్న నాయకులు పాల్గొన్నారు. సిఐటియు అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓబులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, శ్రామికుల హక్కులు హరింప బడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కష్టం కార్మికులది.. సంపద కార్పొరేట్లది అన్న చందంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకొచ్చి వెట్టిచాకిరీ వ్యవస్థలోకి కార్మికులను నెట్టివేస్తోందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ కార్పొరేట్లకు ప్రజల సంపదను దోచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాల అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే మేధావులు, కవులు, రచయితలపై దేశద్రోహం కింద కేసులు బనాయిస్తోందన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కివేయాలని చూడడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మోడీ ప్రభుత్వం ఆదేశాలను అమలు చేస్తూ కార్మిక రంగానికి ద్రోహం చేస్తోందని విమర్శించారు. రాయలసీమలో ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాయలసీమలో ఖనిజ సంపద ఆధారిత పరిశ్రమలు, పండ్ల తోటల పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. బంగారు, వజ్రాలు, ఐరన్‌ఓర్, సున్నపురాయి తదితర ఖనిజ సంపద పరిశ్రమలనూ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధనాలు అవలంభిస్తున్న బిజెపిని గద్దె దించడానికి ఐక్య పోరాటాలే మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. నాగమణి, ఎస్. నాగేంద్ర కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, సిఐటియు కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యేసు రత్నం, నాగరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.చంద్రశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయానికి అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నవంబర్ 12న జరిగే దీపావళి పండుగ పురస్కరించుకొని టపాసులు విక్రయించే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. టపాసులు విక్రయించే వారు ఈనెల 20 లోపల కలెక్టరేట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ఏడాది తీసుకున్న అనుమతులు చెల్లవన్నారు. 500 రూపాయలు చలానా కట్టి జిఎస్టి చెల్లిస్తూ, అగ్నిమాపక దళం వారి ఉత్తర్వులు పొందిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్ పనివేళల్లో ఈనెల 20 లోపల సమర్పించుకోవాలన్నారు. అనుమతులు తీసుకోకుండా టపాసులు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా జీవించండి

బత్తలపల్లి : గ్రామాల్లో కక్షలు వీడి ప్రశాంతంగా, ఐక్యంగా కలిసిమెలిసి జీవించాలని బత్తలపల్లి ఎస్ఐ పి. శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం మండలంలోని గరిశింపల్లి, ఉప్పర్లపల్లిలో పర్యటించారు. గ్రామసభను ఏర్పాటు చేసి ప్రజలకు పలు సూచనలు చేశారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. పేకాట, మట్కా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. విచ్చలవిడిగా మద్యం సేవించి గ్రామాలలో అశాంతికి గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా స్టేషన్‌కు వచ్చి కలువవచ్చునని అన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుని ఆలయంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ తెలిపారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక శివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం నుంచి పది రోజులు పాటు ప్రతి రోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కేశవస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమరాపురంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-మడకశిర

డా॥దినకరన్

అమరాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఆదివారం నాడు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ దినకరన్ తెలిపారు. తన తండ్రి నరసింహప్ప వైద్యుడిగా పనిచేస్తూ ఎంతోమందికి సేవలు అందించారన్నారు. ఆయన జ్ఞాపకార్థం తాను పుట్టిన నియోజకవర్గాల్లో ఉచిత వైద్య సేవలు అందించడానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం నాడు అమరాపురంలో మెగావైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నపిల్లలకు, గుండె చికిత్సలు, కంటి చికిత్సలకు పరీక్షలు చేస్తామన్నారు. మడకశిర నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

19న భక్త కనకదాసు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గోరంట్ల

విలేకరులతో మాట్లాడుతున్న ఆదినారాయణ

పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఈనెల 19న భక్త కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విగ్రహ స్థలదాత ఆదినారాయణ తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19వ తేదీన జరిగే కార్యక్రమానికి మండలంలోని గ్రామగ్రామాన ఉన్న కురుబ కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మల్లికార్జున, రమేష్, ఆంజనేయులు, బాలకష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశక్తి -పెనుకొండ

ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనంతపురం నగరానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ హార్ట్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం నాడు పెనుకొండ పట్టణంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్‌విఆర్ హాస్పిటల్‌లో నిర్వహించిన శిబిరాన్ని ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఏ.హరి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ ట్రస్ట్ సమాజ సేవ, సమాజ హితం కోసం నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచితం పరీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో అందరి సహకారంతో ఆత్మీయ ట్రస్ట్ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని ట్రస్టు చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 154 మంది వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్క్ హాస్పిటల్ డాక్టర్లు అమర్ మహేష్, నాగరాజు, మేనేజర్ వెంకటేష్, యుటిఎఫ్ నాయకులు రమేష్, నరేష్ ఎంకె.నబీ, మహాలింగప్ప, పెద్దిరాజు, గంగాధర్, రామాంజినేయులు శేషాద్రి, తిప్పేస్వామి, సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెవైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు, పాల్గొన్న ఆత్మీయట్రస్ట్ సభ్యులు, యుటిఎఫ్ నాయకులు

నీటి సరఫరాలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆర్‌టిసి కాలనీలో ఉన్న నీటి సరఫరా విభాగం పంపింగ్ పాయింట్ వద్ద వాల్ లీకేజీ ఏర్పడి నీరు వృథా అవుతోంది. ఈ పాయింట్ నుంచి ఆర్‌టిసి కాలనీ 1, 2తో పాటు త్యాగారాజ్‌నగర్, శాంతి నగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా అవుతుంది. ఈ ప్రాంతంలో ఒక్క రోజు నీరు వదిలితే తిరిగి వదలడానికి కనీసం 8 రోజుల పైనే పడుతుంది. ఆ వచ్చిన నీటిని ప్రజలు ఎంతో పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. నీటి సరఫరాలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రతి ఇంటికి నీటిని అందించాల్సిన వాటర్ మ్యాన్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. పైపులు, వాల్వులు లీకేజీలు అయితే వాటి మరమ్మతులపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నీటి వృథాపై మున్సిపల్ ఎంఇ వెంకటరమణ మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘంలో నీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వాల్ వద్ద నీరు ఫౌంటైన్‌లా ఎగిసి పడుతున్న దృశ్యం

17న మండల మీట్

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 17న మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బారాన్‌సాబ్ తెలిపారు. ఎంపిపి గాయిత్రి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అడకత్తెరలో అధికారులు..!

రాష్ట్రంలోనే అత్యంత క్లిష్టమైన నియోజకవర్గంగా ఉరవకొండ ఉంటుందనడంలో సందేహం లేదేమో. ఇక్కడ విధులు నిర్వహించడం అధికారులకు త్రిశంకుస్వర్గంలా ఉంటుంది. ముగ్గురు ముఖ్యమైన నాయకులుండటం, అందరినీ సమన్వయం చేయడం అధికారులకు తలకుమించిన భారమవుతోంది. అందులో ఒకరు ప్రతిపక్ష నాయకులైతే, ఇద్దరు అధికారపక్ష నాయకులున్నారు. వీరిలో ఏ ఒక్కరి మధ్య పొసగడం లేదు. అందులోనూ ముగ్గురు బలమైన వారే కావడంతో ఎటు అడుగు వేయాలో తెలియక అధికారుల అడకత్తెరలో చిక్కుకున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి.

◆ ఉరవకొండలో ఒత్తిడి మధ్య ఉద్యోగం

◆ ముగ్గురి నడుమ నలుగుతున్న అధికారులు

◆ అక్కడ విధులు త్రిశంకుస్వర్గం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉరవకొండ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీ గెలిచిన దాఖలాలు కూడా లేవు. 2019 ఎన్నికల్లోనూ అదే జరిగింది. రాష్ట్రమంతటా వైసిపి గాలి వీచినా ఉరవకొండలో మాత్రం టిడిపి గెలుపొందింది. పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం ఆయన పిఎసి చైర్మన్ గానూ బాధ్యతలు చేపట్టారం. ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్న శివరామిరెడ్డి సైతం ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయన ప్రివిలైజ్ కమిటీ చైర్మన్‌గానూ ఉన్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి వైసిపి ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇలా ముగ్గురు ముఖ్యమైన నాయకులు ఈ నియోజకవర్గం నుంచి ఉన్నారు. దీంతో ఏదైనా కార్యక్రమాలు జరిగినప్పుడు ముగ్గురు నాయకులను సమన్వయం చేయడం ఇక్కడి అధికారులకు అడకత్తెరలో చిక్కిన పోకచెక్కలాగా మారింది. అవునంటే ఒకరికి కోపం కాదంటే మరొకరికి కోపం అన్నట్టుగా వ్యవహారాలుంటున్నాయి. ఈ వ్యవహారాల నడుమే ఇప్పటికే చాలా మంది అధికారులు ఇబ్బందులు పడుతున్న దాఖలాలున్నాయి. ఓటర్ల జాబితా విషయంలోనూ ఇప్పటికే ఆరుగురు ఉద్యోగులు సస్పెన్షన్‌కు సైతం గురయ్యారు. అక్కడ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన వారికి కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

గృహ ప్రవేశాల్లోనూ అధికారులకు తప్పని తిప్పలు

రాష్ట్ర ప్రభుత్వం అన్ని చోట్లా సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఈ నెల 12వ తేదీన పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఉరవకొండ నియోజక వర్గంలోనూ ఇవి జరుగు తున్నాయి. ఈ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సమస్య తలెత్తి అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ ఉన్నారు. ఎమ్మెల్సీగా శివరామిరెడ్డి ఉన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విశ్వేశ్వరరెడ్డి ఉన్నారు. ఈ గృహ ప్రవేశాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పేర్లు వేయడంలోనూ ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండు రోజులుగా ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. వీటి ప్రారంభోత్సవ వేదికల్లో పేర్లు వేయడంలోనూ తలలుపట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ మాత్రం తప్పు జరిగినా ఏకంగా వేటు కూడా పడే అవకాశాలు ఉండడంతో అధికారులు బిక్కుబిక్కు మంటున్నారు. ఏమి చేస్తే ఏ నాయకుని ఆగ్రహానికి గురవాల్సి వస్తోందన్న ఆందోళన వారిలో కన్పిస్తోంది. ఇలా ఉరవకొండ నియోజకవర్గంలో ముగ్గురు నేతల మధ్య అధికారులు ఎటు వెళ్లాలో తెలియక సతమతం అవుతున్నారు.

కరువుపై కసరత్తు ఏదీ ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు మేఘాలు కమ్ముకొచ్చాయి. ఇప్పటికే ఆగస్టు వర్షాభావంతో రైతులు పంటల సాగు నామ మాత్రంగానే చేశారు. వర్షాభావ పరిస్థితులు అక్టోబరులోనూ కొనసాగుతున్నాయి. చినుకు జాడ లేకపోవడంతో రబీ పంటల సాగు ప్రశ్నార్థకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అక్టోబరు మాసం ప్రారంభమై 12 రోజులు పూర్తయింది. ఇప్పటి వరకు చూస్తే ఆత్మకూరు, కూడేరు మండలాల్లో మినహా తక్కిన ఏ మండలంలోనూ చినుకు జాడలేదు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవనాల ద్వారా వర్షాల్లోస్తే, అక్టోబరు నుంచి ఈశాన్య రుతుపవనాలు వీస్తాయి. నైరుతి రుతుపవనాల కాలంలో గతేడాది 33 రోజులు వర్షం పడిన రోజులు నమోదవగా ఈ ఏడాది 31 రోజులు వర్షం పడిన రోజులు జిల్లాలో నమోదయ్యాయి. అదే అక్టోబరు మాసంలో 18 రోజులు వర్షం పడిన రోజులు నమోదవగా ఈ ఏడాది ఒక్క రోజు మాత్రమే వర్షం పడింది. అది కూడా ఆత్మకూరు, కూడేరు మండలాల్లో మాత్రమే. సాధారణంగా రబీ పంటలు నల్లరేగడి నేలల్లోనే జిల్లాలో సాగవుతాయి. ఇవి తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లోనే అత్యధికంగా ఉన్నాయి. అయితే ఈ ప్రాంతాల్లోనూ చినుకు జాడలేదు. దీంతో రబీ సాగు సైతం ప్రశ్నార్థకమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంకో వైపు ఆయకట్టు ప్రాంతాల్లోనైనా పంటలు పండుతాయని ఆశిస్తే ఆ ఆశలు కూడా గత వారం నుంచి అవిరయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాకు సాగునీటిని అందించే ప్రధాన ప్రాజెక్టులైన తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల్లో నీటిమట్టం పడిపోయింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నవంబరు నెలలో నీరు నిలిచిపోయే అవకాశమున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇక శ్రీశైలం నుంచి వచ్చే హంద్రీనీవాకు అక్టోబరు ఆఖరుతోనే నీటి సరఫరా నిలిపివేయనున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లోనూ ఆందోళన నెలకొంది. సాధారణంగా వచ్చినట్టుగానే ఈసారి నీళ్లు వస్తాయని భావించి పంటలు సాగు చేసిన రైతులు నీరు రాదన్న విషయం ఆలస్యంగా తెలియడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని ఏ రకంగా అధికమించి రైతులను ఆదుకోవచ్చున్న ఆలోచన చేస్తున్న దాఖలాలు పాలకుల్లో కనిపించడం లేదు. రాజకీయపరమైన అంశాలపై తప్ప కరువు పరిస్థితులపై సమీక్షిస్తున్న వారు లేరు. మరోవైపు తాగునీటి సమస్య కూడా తీవ్రమవుతోంది. గుత్తి తదితర ప్రాంతాల్లో ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళనలు చేపట్టారు. వర్షాభావం ఇదే రకంగా కొనసాగితే మరికొన్ని గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు ఎదురయ్యే సూచనలున్నాయి. ఎందుకంటే భూగర్భ జలాలు పడిపోతున్నాయి. అటు సాగు, ఇటు తాగునీటి ఇబ్బందులు రెండు స్పష్టంగా కళ్ళముందు కనిపిస్తున్నాయి. దీన్ని అధిగమించేందుకు ప్రణాళికలేవీ కనిపించడం లేదు. రాజకీయంగా తెలుగుదేశం పార్టీ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. చంద్రబాబునాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ ఆందోళనలు ..దీక్షలు చేపడుతున్నారు. అనంతపురం జిల్లా నుంచి సైకిల్ యాత్రలు సైతం చేపట్టారు. ఇక ఈ వారంలో కృష్ణ ట్రిబ్యునల్ గెజిట్ నోటిఫికేషన్‌పైనా చర్చ నడుస్తోంది. ప్రస్తుతమిచ్చిన నోటిఫికేషన్లను పు: సమీక్షించాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపైనా చర్చా వేదికల ద్వారా విన్నపాలు వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. సమగ్రాభివృద్ధిపై అనంతపురం నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో సదస్సు జరుగగా, ఈ వారంలో పెనుకొండలో భూ పంపిణీపై రాష్ట్ర సదస్సును నిర్వహించారు. సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరులో గత కొన్ని రోజులుగా ఇళ్ల పట్టాలపై పోరాటం సాగిస్తున్నారు. గుడిసెలు తొలగించినందుకు నిరసనగా తహశీల్దారు కార్యాలయంలోనే స్నానాలు, ఆహారం, నిద్ర చేశారు. పేదలందరికీ ఇంటి స్థలమిస్తామన్న ప్రభుత్వం ఆచరణలో చేసి చూపించాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు. సత్యసాయి జిల్లాలో జరిగిన ఈ పోరాటం చర్చనీయాంశం అయింది.

అనంత వీక్షణం

నేరాలు ఘోరాలు

గొర్రెల దొంగలు అరెస్టు

నల్లచెరువు : మండల పరిధిలోని నీలావాండ్లపల్లిలో గత నెల 21న గొర్రెలను చోరీ చేసిన దొంగలను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులు అన్నమయ్య జిల్లాకు చెందిన కంప శ్రీనివాసులు, తనకల్లు చెందిన కత్తి వెంకటేష్, అన్నమయ్య జిల్లాకు చెందిన సిద్దేశ్, తనకల్లుకు చెందిన కత్తి బయన్న నలుగురు తాగుడుకు, చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించే మార్గం దొంగతనమేనని నిర్ణయించుకుని గత నెల 21వ తేదీ నల్ల చెరువు మండలం నీలావాండ్లపల్లి వద్ద గొర్రెల మంద వద్ద కాపలాగా ఉన్న పక్కీరప్ప, గోవిందమ్మ అనే వృద్ధ దంపతులను మంచానికి కట్టేసి కట్టెలతో కొట్టి రెండు ఆటోల్లో గొర్రెలను ఎత్తుకెళ్లారు. వీరికి చంద్రశేఖర్, అలియాస్ చందు, గంగరాజు, అలియాస్ రాజు, కమురుపల్లి వెంకటరమణ సహకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కదిరి డీఎస్పీ శ్రీలత ఆదేశాలతో రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, నల్లచెరువు ఎస్ఐ లింగన్న, కానిస్టేబుల్లు ప్రతాప్, రంజిత్ నాయక్ బృందాలుగా ఏర్పడి సమాచారాన్ని సేకరించి నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుండి రెండు లక్షల రూపాయల విలువ చేసే గొర్రెలను స్వాధీనపరచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరగా చేధించిన నల్లచెరువు ఎస్ఐ లింగన్నను ఉన్నతాధికారులు అభినందించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. మహమ్మదాబాదు క్రాస్ వద్ద ఏద్దులవారి పల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ కర్నాటక మద్యం తరలిస్తుండగా తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సెబ్ అధికారుల దాడులు

పుట్టపర్తి రూరల్ : ఎస్పీ ఆదేశాలతో సెబ్ పోలీసులు జిల్లాలో మెరుపుదాడులు నిర్వహించారు. సెబ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సత్యసాయి పుట్టపర్తి సెబ్ ఎస్ఐ, సిబ్బంది రొద్దం మండలం గౌరాజుపల్లిలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 104 కర్నాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.హిందూపూర్ సెబ్ స్టేషన్ పరిధిలోని హిందూపురం మున్సిపాలిటీలో 1, చెన్నేకొత్తపల్లి సెబ్ స్టేషన్ పరిధిలో కనగానపల్లి పెట్రోల్ బంక్ వద్ద 1, మడకశిర సెబ్ స్టేషన్ పరిధిలో గుడిబండ మండలం మందపల్లిలో 1 కేసును నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని 91 కర్నాటక మద్యం పాకెట్ల స్వాధీనం చేసుకున్నారు. ఇసుక దందా మీద నిఘా వేసి తనకల్లు సెబ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది దాడులు నిర్వహించారు. తనకల్లు మండలం ఎంసి తండా వద్ద అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్ సీజ్ చేశారు. 4 టన్నుల ఇసుక, ట్రాక్టర్‌ను సీజ్ చేసి నిందితుడిని తనకల్లు పోలీస్ స్టేషన్లో హాజరు పరిచారు.

దొంగలు అరెస్టు

చిలమత్తూరు : ఒరిజినల్ బంగారుని తక్కువ రేటుకే ఇస్తామని నమ్మించి నకిలీ బంగారు ఇచ్చి సొమ్ము చేసుకునే ముఠాని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చిలమత్తూరు ఎస్ఐ వి.గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్రానికి చెందిన పి.గోపాల్, పి.వెంకటరమణ, శివమణిని అరెస్టు చేశామని తెలిపారు. అలాగే వారి వద్ద నుండి 2.85 కేజీల నకిలీ బంగారు,0.36 గ్రాముల ఒరిజినల్ బంగారు గుండ్లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్ కు పంపినట్లు చెప్పారు.

ఉరవకొండలో భారీ చోరీ

రూ.10 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

ఉరవకొండ : ఉరవకొండలో దొంగలు రెచ్చిపోయారు. కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఓ గదిలో నిద్రిస్తుండగానే మరో గదిలో బీరువా తాళం బద్దలు కొట్టి రూ.10లక్షలు దోపిడీ చేయడం తీవ్ర సంచలనం కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే... పట్టణంలోని ప్రముఖ శనగల వ్యాపారి గోపాల్‌రెడ్డి అర్ధరాత్రి సెనగల లారీ లోడు రావడంతో భార్య ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటికి బయట తాళం వేసి సరుకు అన్‌లోడ్ చేయించడానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు అతను బయటికి వెళ్లగానే ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి అతడి భార్య మరో గదిలో నిద్రిస్తున్న సమయంలోనే ఇంకో గదిలో ఉన్న బీరువాలోని రూ.10లక్షల నగదును ఎత్తుకెళ్లారు. తర్వాత ఇంటికి వచ్చిన గోపాల్‌రెడ్డి గమనించి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

రాయదుర్గం : రాయదుర్గం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలో 10మంది మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి రూ.4 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సర్కిల్ సిఐ వి.యుగంధర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కణేకల్, బొమ్మనహాల్, డి.హీరేహాల్ పరిధిలో కొందరు సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో గుట్టు చప్పుడు కాకుండా మట్కా నిర్వహిస్తూ వసూలు చేసిన సొమ్మును కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి పంపుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో ఎస్‌లై రంగడు, శివ, దుగ్గిరెడ్డి, సిబ్బంది మట్కా నిర్వాహకులపై నిఘా ఉంచి శనివారం ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లో పరిధిలో మట్కా నిర్వాహకుల వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, మట్కా జూదానికి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కర్నాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సెబ్ పోలీసులు శనివారం జిల్లావ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదు కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేయడంతోపాటు 1368 టెట్రా పాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి, కణేకల్ సెబ్ స్టేషన్ల పరిధిలో ఆయా సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో రెండు కేసులు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. 37 టెట్రా పాకెట్లు, రెండు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గుత్తి సెబ్ స్టేషన్ పరిధిలో ఒక నాటుసారా కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేశారు. 60 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఉరవకొండ సెబ్ స్టేషన్ పరిధిలో డోనేకల్ చెక్‌పోస్ట్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఒక కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేశారు. 22 టెట్రా పాకెట్లు, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఈనెల 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరగనున్న దసరా ఉత్సవాలకు హాజరుకావాలని ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డిని ఆహ్వానించారు. ఆనవాయితీగా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందించి ఉత్సవాలకు ఆహ్వానించారు. నేపథ్యంలో ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఉమామహేశ్వర్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి కదిరి టౌన్

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధనకై తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని మాదిగల రిజర్వేషన్ పోరాట జాతీయ నాయకులు ఆనంద్, నాగేంద్ర కోరారు. నవంబర్ మొదటివారంలో తలపెట్టిన చలో హైదరాబాద్‌కు సంబంధించిన కరపత్రాలను గాండ్లపెంట మండలంలో శనివారం పంపిణీ చేశారు. అనంతరం మాదిగ ఉద్యోగుల సమైక్య నూతన కార్యవర్గం ఎన్నికను నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐకి సన్మానం

కదిరి టౌన్ : కదిరి అర్బన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన నారాయణ రెడ్డిని వైసిపి నాయకులు బహువుద్దీన్ అధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనినవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, రాష్ట్ర చేనేత సంఘ కార్యదర్శి, వైసిపి నాయకులు ఎం నాగమల్లు, మైనారిటీ నాయకులు మలాంగ్‌షా, షఫీ, టైలర్ జీలాన్, మస్తాన్ ఖాన్, బేకరీ జీలాన్ బాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి కొత్తచెరువు

మండల పరిధిలోని ఎర్రబెల్లి గ్రామంలో వైసిపికి చెందిన బాధిత కుటుంబాలను పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి శనివారం పరామర్శించారు. వైసిపి నాయకుడు నరసింహారెడ్డి ఇటీవలే అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వాలంటరీ జోష్ణ భర్త నాగరాజు ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచి గీతాబాయి, వైసీపీ నాయకులు బాషా, నంజి రెడ్డి, మున్వర్‌బాషా, సూరి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందజేత

ప్రజాశక్తి కదిరి టౌన్

రూరల్ మండలం గంగన్నగారిపల్లికి చెందిన నాగరాజు అనే బాధితుడికి పంటనష్ట పరిహారం అందజేశారు. అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న ఇంటి పట్టాల పంపిణీ స్థానంలో అదే గ్రామానికి చెందిన నాగరాజు వరి మడి వేసుకొని జీవనం సాగిస్తున్నాడు. దీంతో నాగరాజు పంటకు నష్టం జరిగిన నేపథ్యంలో పరిహారంగా ఎమ్మెల్యే సిద్ధారెడ్డి రూ. 20 వేలు, కుమ్మరవాండ్లపల్లి సర్పంచి శాంతమ్మ బాయి కుమారుడు మణికంఠ నాయక్ రూ. 20 వేలు మొత్తం రూ. 40 వేలను నాగరాజుకు ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా నాగరాజు కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఓబుళదేవరచెరువు : టిడిపి కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కొండకమర్ల పంచాయతీ వీరప్ప గారి పల్లిలో గతవారం జరిగిన ఘర్షణలో గాయపడిన వారిని పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గొర్ల శంకర, పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జాకీర్ అహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు. పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి జయ చంద్రారెడ్డి.నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఈడగొట్టు ఆంజనేయులు, నియోజవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సన్నకాల గంగాద్రి, నాయకులు రామచంద్ర, హనుమంతు, నాగేందర్ నాయక్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

ట్రినిటీ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ నేత్రాలయ వారు సంయుక్తంగా కలిసి ఉచితంగా అంధత్వ నివారణకు కృషిచేయడం అభినందనీయమని సిఅండ్ ఐజి మిషన్ చర్చి అధ్యక్ష కార్యదర్శులు అనీల్ కుమార్, పాల్ అన్నారు. శనివారం పట్టణంలోని అల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల రెండవ శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి చూపు కోల్పోయిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఈ శిబిరంలో 475 మందికి కంటి పరీక్షలు నిర్వహింగా ఇందులో 155 మందిని శస్త్ర చికిత్సకోసం బెంగళూరుకు తరలిచారు. గత నెల శస్త్ర చికిత్సలు నిర్వహించిన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ ఆర్గనైజేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్ రాజా, ఉషారాణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాధవి, అసుపత్రి సిబ్బంది, సి అండ్ ఐజి మిషన్ చర్చి పాల్, వాలంటీర్లు రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 సంవత్సరాలుగా డేటా ఎంట్రీ ఆపరేటర్స్, కేజీవీబీ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ ఉద్యోగులుగా, ఆయాలుగా, ఫిజియోథెరపిస్టులుగా, మండల లెవెల్ అకౌంటెంట్లుగా ఉద్యోగాలు నిర్వహిస్తున్నామని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు రామన్న, ఓబిరెడ్డి, ఉద్యోగులు వరలక్ష్మి, వరాలు, శకుంతల, చంద్రయ్య ,రాజేష్, భాస్కర్, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

మానవ అక్రమ రవాణా పై వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీ రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణంలో కలెక్టరేట్ నుంచి సత్యమ్మ గుడి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దిశా డీఎస్పీ వరప్రసాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ లక్ష్మి కుమారి, మహిళా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ నరసయ్య హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా రెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ భానుజా మాట్లాడుతూ రెడ్స్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ దిశా పోలీస్ మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా, మూమెంట్ గ్లోబల్ ఫౌండేషన్ (ది మూమెంట్ ఇండియా) వారి సహకారంతో జిల్లాలో మానవ అక్రమ రవాణా నిరోధానికి కృషి చేస్తున్నామన్నారు. పీడీ నరసయ్య మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా ఒక సామాజిక సమస్య దీనిని అరికట్టడానికి పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీపీస్ రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, అధికారులు

వ్యర్థాలున్న ఈ ట్రక్కు ఎవరిది..?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో అర్ధ రాత్రి దాటితే చాలు ట్రక్కుల్లో, ట్యాంకర్ల ద్వారా వివిధ పరిశ్రమలకు చెందిన వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు, తరలిస్తున్నారు. ఇప్పటికే రసాయనక, స్టీల్ పరిశ్రమల వల్ల గాలి కాలుష్యం అవుతున్న నేపథ్యంలో ఆయా పరిశ్రమల వ్యర్థాలను సైతం భూమిపై వేయడంతో భూమి కాలుష్యం అవుతోంది. ఈనేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఎపి 39 యూఐ 8092 నెబరు గల ట్రక్కులో వ్యర్థాలను తీసుకొచ్చి వేశారు. ఆ ట్రక్కుపై ఫోన్ నెంబర్లు సైతం ఉన్నాయి. అయితే ఈ వ్యర్థాలు ఎక్కడ నుంచి తీసుకొచ్చారు... ఏ పరిశ్రమ నుంచి తీసుకొచ్చారన్నది తెలియడం లేదు. ఇప్పటికే తుమకుంట, గోళ్ళపురం పారిశ్రామిక వాడతోపాటు చుట్టుపక్కల ఉన్నా గ్రామాల ప్రజలు కాలుష్యపు కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నారు. ఇప్పటికే ఉక్కు, రసాయనక పరిశ్రమల నుంచి వెలువడే విషవాయువును పీల్చే ప్రజలకు మరో బహుమానంగా పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాలను చుట్టు పక్కల పారివేయడం వల్ల భూమి సైతం కాలుష్యం అవుతోంది. రసాయనక పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు భూమిలోపల సుమారు 50 అడుగుల లోపలకు వేసి పూడ్చాలి. అయితే కొందరు ప్రజాప్రతినిధులే ఏజెంట్లుగా మారి పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాలకు ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు చేసి జన నివాసం లేని ప్రాంతాల్లో వేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికి కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి.

వ్యర్థాలను తీసుకొచ్చిన ట్రక్కు

చంద్రబాబు ఆరోగ్యంపై కోర్టు జోక్యం చేసుకోవాలి

పెనుకొండలో నిరసన ప్రదర్శనలో సవితమ్మ, నాయకులు

కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

చంద్రబాబు ఆరోగ్యంపై కోర్టు జోక్యం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ డిమాండ్ చేశారు. చంద్ర బాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా శనివారం పట్టణంలోని ఎన్ టి ఆర్ సర్కిల్ వద్ద నుండి నల్ల బెలూన్లతో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యంపై జగన్ ప్రభుత్వం తప్పుడు సమాచారాన్ని బయటకు పంపుతోందని ఆరోపించారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ల రిపోర్టు కాకుండా సజ్జల స్క్రిప్టును అధికారులు విడుదల చేస్తున్నారని ఆరోపించారు. జైల్లో అపరిశుభ్రత వాతావరణం, కలుషిత నీటిని సప్లై చేయడం వల్లే చంద్రబాబుకు అలర్జీ వచ్చిందని అనుమానం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఆరోగ్యం పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, సీపీఐ శ్రీరాములు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్, రామకృష్ణారెడ్డి, తివేంద్ర, మాజీ ఎంపీటీసీ రమణమ్మ, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం మాగే చెరువు సర్పంచి నరసింహులు, మారుతి ప్రసాద్, చిన్నపోతన్న, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆధారాలు లేని అక్రమ అరెస్టు నిలవలేవని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, కృష్ణమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మండల ప్రధాన కార్యదర్శి జయరాం, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి దాదు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు రఘు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు పట్టణంలో శనివారం తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. చంద్రబాబుకు ఏమైనా జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్, కార్యదర్శి నరేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, యనమల గంగాధర్, మంజునాథ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : చంద్రబాబు ఆరోగ్యంపై కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకొని మెరుగైన వైద్యం సేవలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం గుడిబండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు పై ఏ ఆధారాలు లేని కేసులు బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి కూడా నీతులు చెబుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

మడకశిర రూరల్ : చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఆరోగ్యంపై కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. చంద్రబాబుకు అత్యవసర వైద్యం అందించడంలో ప్రభుత్వ విఫలమైందన్నారు. చంద్రబాబు నాయుడికి ఏమైనా జరిగితే జగన్ మోహన్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆదినారాయణ, అశ్వత్థామప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : చంద్రబాబును అరెస్టు చేయడం పిరికిపంద చర్య అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ జగన్ నాలుగు సంవత్సరాల పాలనలో రాష్ట్రం అధోగతి పట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కన్వీనర్ మల్లిరెడ్డి, మాజీ సర్పంచి సాకే యశోద రాయుడు, మాజీ ఎంపీపీ బాలు, మీసాల మురళి, లావణ్య గౌడ్, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా , టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జనసేన నాయకుడు అబ్దుల్లా, జయరాం, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు..

ధర్మవరం టౌన్: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఆటవిక పరిపాలన చేస్తోందని టీడీపీ నాయకులు విమర్శించారు. చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ధర్మవరం పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పురుషోత్తంగౌడ్, పరిసేసుధాకర్, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, పణికుమార్, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, చిగిచెర్లరాఘవరెడ్డి, సనత్, భీమినేని ప్రసాద్‌యుడు, తదితరులు పాల్గొన్నారు.